

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
మంచిర్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 19 అక్టోబరు 2025





ఉపాధి పనుల్లో
పొరపాట్లు సరిదిద్దుకోవాలి
జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్

హాస్టల్ వార్డెన్ ఆత్మహత్యాయత్నం 9

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు
వేగవంతం చేయాలి 9
● కలెక్టర్ కుమార్‌దీపక్





మంత్రికి కాంట్రాక్టర్ల వినతి


మంత్రి వివేక్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు

మందమర్రిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి పనులు పూర్తి చేసిన తమకు బిల్లుల చెల్లింపు జరగడం లేదని దీనితో తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని బిల్లులు చెల్లించేలా చూడాలంటూ మంచిర్యాల కాంట్రాక్టు అసోసియేషన్ నాయకులు శనివారం మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 200 మందికిపైగా సివిల్ కంట్రాక్టర్లం ఉన్నామని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆయా అభివృద్ధి పనులు పూర్తి చేశామని, ఒక్కొక్క కాంట్రాక్టు పేరిట రెండు కోట్లకుపైగా చెల్లింపులు ఉన్నాయని తెలిపారు. దీని వల్ల పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని పరి స్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చి బిల్లులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల కాంట్రాక్టు అసోసియేషన్ నాయకులు మధన్‌మోహన్‌రావు, రావికంటి వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

గనులు, విభాగాలపై వినతిపత్రాలు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ పిలుపుమేరకు శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలలో బాధ్యులకు వినతి పత్రాలు అందించారు. ముఖ్య అతిథులుగా నాయకులు ముష్కె సమ్మయ్య, పెట్టం లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో రిజర్వేషన్లపై రాష్ట్ర బంద్ నిర్వహించడం బీసీ సమాజం ఒక్కటైందనడానికి సంకేతమన్నారు. పాలక ప్రభుత్వాలు రిజర్వేషన్లు ప్రకటించకపోవడంతో చట్టసభల్లో బీసీలు అనుకున్న మేరకు లేరని, వారికి రావాల్సిన ఉద్యోగాలు, సంక్షేమం రావడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే 9వ షెడ్యూల్‌లో బీసీ బిల్లును చేర్చి వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఏరియా స్థాయిలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు మారుతి, బుచ్చయ్య, రాచర్ల చంద్ర మోహన్, రఘురాం, రవీందర్, రాందాస్, కుమారస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

లక్కీడ్రా పద్ధతిన గురుకుల పాఠశాలల విద్యార్థుల ఎంపిక

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేసి భర్తీ చేసినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా తీశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గురుకుల బాలికల పాఠశాలల్లో 74 సీట్లు ఖాళీగా ఉండగా 37 సీట్లు భర్తీ చేశామన్నారు. బాలుర పాఠశాలలో 89 సీట్లు ఉండగా 38 భర్తీ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రమిదల వేడుక
రేపు దీపావళి
9

బీసీ బంద్ ప్రశాంతం

- పాల్గొన్న అన్ని వర్గాల ప్రజలు
- మూసి ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు
- మద్దతు ప్రకటించిన అన్ని రాజకీయ పార్టీలు
- స్వచ్ఛందంగా మూసి ఉన్న విద్యా సంస్థలు


మంచిర్యాలలో డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

మంచిర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హై కోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త బంద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. బీసీ జేఏసీ సన్నాహక సమావేశాలతో అన్ని వర్గాల మద్దతును కూడగట్టింది.

'బంద్ ఫర్ జస్టిస్' నినాదంతో బీసీ ఐక్య వేదిక ఇచ్చిన బంద్ పిలుపునకు అధికార కాంగ్రెస్ పార్టీతో సహా బీజేపీ, బీఆర్ఎస్, వామపక్ష పార్టీలు, టీజేఎస్, జాగృతితో పాటు అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. జిల్లా వ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, వైన్, బార్ షాపులు, సినిమా హాళ్లను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ఆర్టీసీ బస్సులు కూడా పూర్తిగా డిపోకే పరిమితం అయ్యాయి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను యజమానులు స్వచ్ఛందంగా మూసి ఉంచారు.

ర్యాలీలతో నిరసన..

బీసీ బంద్ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను వెంటనే అమలు చేయాలని ప్రజా, వామపక్షసంఘాల నాయకులు పేర్కొన్నారు. బీసీ బంద్‌కు మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలో నిరసనలు చేపట్టి ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకుని బీసీలకు ద్రోహం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని తెలిపారు. రాష్ట్రంలోని కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం బీజేపీ కుట్రలను చేస్తుందన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు బీసీల పట్ల ప్రేమ ఉంటే వెంటనే రాజీనామాలు చేసి వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకె రవి, లాల్‌కుమార్, జయారం, దేవరాజ్, ప్రకాష్, రంజిత్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రాములు, రాజేందర్, శ్రీనివాస్, బ్రహ్మానందం, సురేందర్, పోశన్న, తిరుపతి, రామన్న, శ్రీనివాస్, ప్రకాష్, రమేష్, రాములు, కొండయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

నస్పూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా శనివారం నస్పూర్ పట్టణంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్ సందర్భంగా వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ఆటోలు బంద్ పాల్గొన్నాయి. బీసీ సంఘాల నేతలు, సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, ఆటో యూనియన్ ఆనర్, డ్రైవర్లు పట్టణంలో వేర్వేరుగా మోటర్ సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ర్యాలీలు సాగాయి. నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

లక్సెట్టిపేట, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మంగ తెలిపారు. శనివారం కళాశాల మైదానంలో అండర్ 19రెజ్లింగ్ పోటీలను నిర్వహించగా కళాశాలకు చెందిన శ్రీరాం, సాయిజశ్వంత్, ప్రశాంత్, అభినయ్, బాలాజీలు ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారని, వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కాకతీయ యూనివర్సిటీ జట్టుకు మిమ్స్ కళాశాల విద్యార్థిని ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

మంచిర్యాల, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్‌లో కాకతీయ యూనివర్సిటీ జట్టుకు మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎన్. అశ్విత ఎంపికై యూనివర్సిటీ జట్టుకు కెప్టెన్ కూడా అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 15, 16, 17 తేదీలలో జరిగిన అంతర్‌జిల్లాల బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నవంబరు 21, 22, 23 తేదీల్లో బెంగుళూరులో జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్లలో పాల్గొంటుందని తెలిపారు. అశ్విత మిమ్స్ డిగ్రీ కళాశాలలో బికాం తృతీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ టి. శ్రీనివాస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ పి. శ్రీధర్‌రావు, డైరెక్టర్ ఎం. విజయ్‌కుమార్, పీడీ శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

- బీసీ రిజర్వేషన్ల కోసం కట్టుబడి ఉన్నాం
- కేంద్రం ఆర్టికల్ 9తో రిజర్వేషన్‌లు అమలు చేయాలి
- మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి


మందమర్రిలో బీసీ సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ రెండు ఒక్కటేనని చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ల విషయంపై ఎందుకు మాట్లాడడం లేదని జవాబు చెప్పాలని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కట్టుబడి ఉందన్నారు. శనివారం మందమర్రిలో బీసీ సంఘాలు నిర్వహించిన ర్యాలీకి ఆయన హాజరయ్యారు. ముందుగా ఆయన మార్కెట్ సెంటర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను మొదటి నుంచి వ్యతిరేకిస్తుంది బీఆర్ఎస్ పార్టీ అని ఈ విషయాన్ని బీసీలంతా గమనించాలన్నారు. మొదట అసెంబ్లీలో ఏకగ్రీవంగా రిజర్వేషన్ల కోసం ఆమోదించిన ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమే అని తెలిపారు. దీనికి సంబంధించి గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. కోర్టులు కూడా రిజర్వేషన్లను వ్యతిరేకించడం విచారకరమన్నారు. అంతేగాకుండా తమిళనాడు ప్రభుత్వం ఆర్టికల్ 9ని అనుసరించి రిజర్వేషన్లను అమలు చేసిందన్నారు. అదే తరహాలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించిన బీసీ బిల్లును ఆమోదం తెలిపితే బాగుంటుందన్నారు. కానీ తమ ప్రభుత్వానికి ఎక్కడ ఈ రిజర్వేషన్లను అమలు చేస్తే తమ ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతుందోనని కేంద్రం ముందుకు రావడం లేదన్నారు. ఈ బందుతోనైన కేంద్రం కల్లు తెరవాలన్నారు. ఈ రిజర్వేషన్లను ఆమోదించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మార్కెట్ సెంటర్ నుంచి ర్యాలీ దుకాణ సముదాయాల మీదుగా కోల్‌బెల్ట్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బీసీ పట్టణ జిల్లా నాయకులు చకినాల శంకర్, పోలు శ్రీనివాస్, కొండిల్ల శ్రీనివాస్, బి. సదానందం,సతీష్, కిరణ్, శేఖర్, కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





చివరి రోజు భారీ స్పందన...


తరలి వచ్చిన వ్యాపారులు

- మద్యం టెండర్లకు బారులు తీరిన వ్యాపారులు
- ఏకంగా వెయ్యి పై చిలుకు దరఖాస్తుల స్వీకరణ
- గతంతో పోల్చితే స్వల్పంగా తగ్గిన సంఖ్య
- ఈ నెల 23న లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక

మంచిర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు టెండర్లకు చివరి రోజైన శనివారం దరఖాస్తు చేసేందుకు వ్యాపారుల నుంచి భారీ స్పందన లభించింది. వైన్‌షాపుల టెండర్లు దాఖలుకు నోటిఫికేషన్ విడుదలై సుమారు 20 రోజులకు పైగా కావస్తున్నప్పటికీ మొదట్లో దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా సాగింది. దరఖాస్తు గడువుకు ఒక రోజు ముందు కూడా ఆశించిన స్థాయిలో వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. అయితే చివరి రోజు మాత్రం భారీ సంఖ్యలో వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం గమనార్హం. చివరి రోజు ఏకంగా వెయ్యి పై చిలుకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబరు 30తో ముగియనుంది. దీంతో 2025-2027 సంవత్సరానికి గాను కొత్త లైసెన్సుల జారీకి ప్రభుత్వం గత నెల 25న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 73 ఏ4 మద్యం షాపుల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు.

దరఖాస్తు రుసుం పెరిగినా తగ్గని పోటీ...

మద్యం షాపుల టెండర్లలో పాల్గొనదలిచే వ్యాపారులు గతంలో కంటే అధికంగా దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాల పరిమితితో ఒక్కో షాపునకు దరఖాస్తు చేసేందుకు రూ. 3 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. గత మద్యం పాలసీలో దరఖాస్తు రుసుం రూ. 2 లక్షలు ఉండగా, ఈ సారి అదనంగా లక్ష రూపాయలను పెంచింది. అయినప్పటికీ మద్యం వ్యాపారం మోజు తగ్గలేదు. జిల్లాలో మద్యం వ్యాపారం లాభసాటిగా ఉండటం, ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించడంతో లిక్కర్ వ్యాపారుల్లో మంచి స్పందన కనిపించింది. దరఖాస్తుదారులకు లక్కీ డ్రా నిరవిజేతల కొత్త దుకాణాలకు లైసెన్స్ కాల పరిమితి డిసెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమై 2027 నవంబరు 30 వరకు అమలులో ఉండనుంది. డిసెంబరు ఒకటవ తేదీ నుంచే దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగనున్నాయి.

చివరి రోజు భారీ స్పందన....

వైన్ షాపుల టెండర్లకు దరఖాస్తు మిగతా 9వ పేజీలో..



చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు

భీమారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమారం గ్రామంలోని లక్ష్మీదేవర ఆలయంలో ఈ నెల 15న గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడగా నిందితులను శనివారం పట్టుకున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, భీమారం ఎస్ఐ శ్వేతలు తెలిపారు. శనివారం భీమారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 15న అర్ధరాత్రి భీమారంలోని లక్ష్మీదేవర ఆలయం తలుపు తాళం పగులగొట్టి 2 తులాల బంగారం, 2 కిలోల వెండి ఆభరణాలు దొంగలించారని గుడి నిర్వాహకుడు అన్నవేన సారయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగల వద్ద నుంచి ఒక బంగారు ముక్కు పుడక (10గ్రాములు), వెండి గొలుసులు 2 (29 గ్రాములు), వెండి ఆభరణాలను కరిగించిన ముద్ద 1.9 కిలోలు, ఒక కవరులో చిల్లర పైసలు, నోట్లు మొత్తం రూ. 3610 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన గోదావరిఖనికి చెందిన సిరికొండ లక్ష్మణ్, రాజురాకు చెందిన కాకట్ల కేశవరెడ్డిలు జల్సాలకు అలవాటు పడి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న భీమారం ఎస్ఐ శ్వేత, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, పోలీసులు మల్లయ్య, కిరణ్, నజీర్‌లను సీఐ అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

భీమిని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేస్లాపూర్ గ్రామం వద్ద శనివారం రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి రైస్ సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆటోల ద్వారా అక్రమంగా కాగజ్‌నగర్ వైపునకు తరలిస్తుండగా సమాచారం అందుకోని పోలీసులు కేస్లాపూర్ గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఆటోతో పాటూ కాగజ్‌నగర్‌కు చెందిన అమీర్ ఖాన్ నిందితుడిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో బియ్యం సేకరించి మహారాష్ట్రకు బియ్యం తరలిస్తారని తెలిపారు. ఆటోను సీజ్ చేశామన్నారు. అనంతరం బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గనుల వద్ద బీసీ సంఘాల ఆందోళన

మందమర్రిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు కోసం బీసీ సంఘాలు తలపెట్టిన బంద్‌లో భాగంగా సింగరేణిలో శనివారం బీసీ కార్మిక సంఘాల నాయకులు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఏరియా వర్క్‌షాపు వద్ద నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు ముల్కలపల్లి వెంకటేశ్వర్లు ఏఐటీయూసీ అనుబంధ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెద్దపల్లి బానయ్య ,ఎగ్గెటి రాజేశ్వర్‌రావు, శర్మ, రాజేశం, వెంకటస్వామి, శ్రీనివాస్, ఆంటోనిదినేష్, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఏరి యాలోని కేకే 5గనిపై టీబీజీకేఎస్ అనుబంధ బీసీ సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మేడిపల్లి సంపత్, శ్రీనివాస్ రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

వాంకిడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మొక్కలు సాగు చేసినా రవాణా అమ్మకం వంటి కార్యకలాపాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రకటణలో హెచ్చరించారు. శనివారం వాంకిడి మండలం చిచ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాం చిచ్‌పల్లి గ్రామ శివారులో మడావి నగేష్ చేనులో సాగు చేస్తున్న 380 గంజాయి మొక్కలను వాంకిడి ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో సెర్చ్ టీం ఆపరేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నాట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి స్వాధీనం చేసిన వారిలో వాంకిడి ఎస్సై మహేందర్, కానిస్టెబుళ్ల అదిత్య, ప్రదీప్, నయిమ్, మల్లేష్, హోంగార్డ్ బలిరామ్‌లు పాల్గొన్నట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు.

ఎస్పీఎంలో గుర్తింపు ఎప్పుడు?



● పట్టించుకోని లేబర్ అధికారులు ● సమస్యలు పరిష్కారానికి నోచుకోక కార్మికుల ఇబ్బందులు

కాగజ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుమరం జిల్లాలోనే అతి పెద్ద కాగితపు పరిశ్రమలో ట్రేడ్ ఎన్నికల ప్రక్రియ కళగానే మిగిలింది. ఎస్పీఎం పునరుద్ధరణ జరిగి ఏడేళ్ల గడుస్తున్నా ఎన్నికలు జరుగక పోవడంతో కార్మికుల్లో అసంతృప్తి నెలకొంది. యాజమాన్యం, లేబర్ శాఖ మధ్య సమన్వయం లేక పోవడంతో కార్మిక హక్కులు పూర్తిగా నిలిచి పోతున్నాయని పలువురు చెబుతున్నారు.

ఎన్నికలు జరుగక పోవడంతో యూనియన్ వ్యవస్థ నిర్వీర్యమై వేతన సవరణలు భద్రతా సదుపాయాలు, సంక్షేమ నిధులు, పదోన్నతులు వంటి అంశాలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. మిల్లు తిరిగి ప్రారంభమైనా కార్మికుల సమస్యలు మాత్రం లేబర్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతిపత్రం ఇస్తున్న సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు(ఫైల్)

ఇక్కడి పరిస్థితులను సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని, కార్మికుల ప్రతినిధి వ్యవస్థను వెంటనే పునరుద్ధరించేలా చూడాలని కోరారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సిర్పూరు ఎమ్మెల్యే హరీష్ బాబు సిర్పూరుపేపర్ మిల్లులో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వెంటనే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తావించారు. ఇంత జరిగినా లేబర్ అధికారులు ఈ విషయంలో ఇంత వరకు చర్యలు తీసుకోవడం లేదు. 2014లో మిల్లు పునరుద్ధరణ తర్వాత ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తారని భావించిన కార్మికుల ఆశలు అడియాశలవుతున్నాయి.

ట్రేడ్ యూనియర్ ద్వారా..

యాజమాన్యం, ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంది. అయితే ట్రేడ్ యూనియన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని, ఆరు నెలల క్రితం ట్రేడ్ యూనియన్ సంఘాల వివరాలు పంపించాలని ఆదిలాబాద్ లేబర్ అధికారి ఇక్కడి వారికి నోటీసులను పంపించారు. ఇందుకు ఎనిమిది ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు పూర్తి వివరాలు సమర్పించారు. అయినా కూడా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేక పోవటంతో కార్మికులు లేబర్ అధికారుల తీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహణ జరిగితే కార్మికుల సమస్యలు, పెండింగ్ బిల్లులు, తదితర అంశాలపై నేరుగా యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించుకునే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

గత నాలుగు రోజుల క్రితం కూడా హైదరాబాద్‌లోని ప్రిన్సిపాల్ సెక్రటరి దాన కిషోర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్పీఎంలో కార్మికులు సమస్యలు, ట్రేడ్ యూనియన్ ఎన్నికల ఆవశ్యకతపై వివరించారు. దీనిపై కూడా సెక్రటరి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికైనా లేబర్ అధికారులు ఈ దిశగా స్పందించి ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు ముక్త కంఠంతో డిమాండు చేస్తున్నారు.

ఎన్నికలు వెంటనే నిర్వహించాలి..

ఓదెలు, ట్రేడ్ యూనియన్ నాయకుడు



ఎస్పీఎం వెంటనే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి. కార్మికులకు, యాజమాన్యానికి మధ్య వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ట్రేడ్ యూనియన్ వ్యవస్థ ఎంత గానో ఉపయోగపడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరిశ్రమల్లో ఎన్నికలు పూర్తిగా జరిగాయి. కాని ఎస్పీఎం మిల్లులో ఇంత వరకు జరుగడం లేదు. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు స్పందించి ఎన్నికలు నిర్వహించాలి.

మద్యం మత్తులో తండ్రిని హతమార్చిన తనయుడు

జన్నారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై మద్యం మత్తులో తండ్రిని కడతేర్చిన సంఘటన జన్నారం మండలంలో చోటు చేసుకుంది. లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం గ్రామ పంచాయతీ పరిధిలో గల సేవాదత్‌నగర్‌కు చెందిన జాదవ్ శంకర్‌నాయక్(50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమారుడు జాదవ్ నూర్‌సింగ్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. అంతేగాకుండా తండ్రిని కొట్టేందుకు వెళ్లేవాడు. ఈ బాధను భరించలేక నూర్‌సింగ్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తరుచుగా తాగి మద్యం కోసం డబ్బులు కావాలని తండ్రిని వేధించేవాడు. శనివారం నూర్‌సింగ్ మద్యం మత్తులో ఆయుధంతో తండ్రి తలపై దాడి చేయడంతో తలభాగంలో తీవ్ర గాయమైంది. దీంతో శంకర్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చేరుకొని ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు నూర్‌సింగ్ పరారిలో ఉన్నాడని, శంకర్ నాయక్ కుమార్తె జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

గెర్రెలో విషాదం

» హత్యకు గురైన గర్భిణి

» కులాంతర వివాహం చేసుకుందని మామ, బావ, తోడికోడలు ఘాతుకం





శ్రావణి(ఫైల్)

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమారస్వామి

దహెగాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో తల్లి కావల్సిన శ్రావణి అనే గర్భిణిని మామతో పాటు ఆమె బావ, తోడికోడలు శనివారం మధ్యాహ్నం హతమార్చడం మండలంలోని గెర్రెలో విషాదం చోటు చేసుకుంది. తమ కొడుకును కులాంతర వివాహం చేసుకుందనే ఆగ్రహంతో తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న యువతిని శనివారం మధ్యాహ్నం పట్టపగలు భర్త కుటుంబ సభ్యులు గొడ్డలి, కత్తితో దాడి చేయడంతో గ్రామంలో భయాందోళన నెలకొన్నది. కుటుంబ సభ్యులు, కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం... గెర్రె గ్రామానికి చెందిన శివార్ల శేఖర్, అదే గ్రామానికి చెందిన శ్రావణి(21) ప్రేమించుకున్నారు. శేఖర్, బీసీ బెస్త కాగా శ్రావణి గిరిజన సామాజిక వర్గానికి చెందినది. వేర్వేరు కులాలు కావడంతో శేఖర్ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వారు ఇంటి నుంచి వెళ్లిపోయారు. శేఖర్ కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని వెతికి పట్టుకున్నారు. ఇద్దరు మేజర్లమని వివాహం చేసుకుంటామని చెప్పడంతో పోలీసులు వారిని వదిలిపెట్టారు. అనంతరం శేఖర్, శ్రావణి పెళ్లి చేసుకున్నారు. ప్రేమ వివాహం చేసున్నప్పటి నుంచి శేఖర్ అత్తగారి ఇంట్లోనే ఉంటున్నారు. ప్రస్తుతం శ్రావణి తొమ్మిది నెలల గర్భిణీ, శ్రావణి మామకు ప్రేమ వివాహం ఇష్టం లేక మనసులో కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం శేఖర్ తన అత్తమామతో కలిసి వంట చెరుకు కోసం సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేక పోవడంతో శ్రావణి మామ శివార్ల సత్తయ్య, పెద్దకుమారుడు కుమార్, పెద్దకోడలు కవితలు ముగ్గురు కలిసి ఇంట్లో నుంచి బయటకు తీసుకు వచ్చి శ్రావణిపై కత్తి, గొడ్డలితో మెడ, గొంతుపై దాడి చేశారు. బలమైన గాయాలు కావడంతో శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. ఇరుగుపొరుగు వారు హత్యకు పాల్పడుతున్న విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేయగా దహెగాం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి శ్రావణి తండ్రి తలండి చెన్నయ్య అలియాస్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం నేరస్తులు పోలీసుకు లొంగిపోయారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధి సోకకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ కోరారు. చిత్తాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన టీఏఎస్-1 సర్వేలో ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్ పి. సుశీల, హెల్త్ అసిస్టెంట్ శ్రీగణేష్, ఎల్‌టీ సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల శ్రమదానం

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టు రైతులు శనివారం శ్రమదానం చేశారు. పూడికతో కాలువ నిండిపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడం లేదని రైతులు చెప్పారు. అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవ డంతో పూడిక తీసుకున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న హాస్టల్ డెయిలీవేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న దీక్షలు 37వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు కృష్ణమాచారి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ చేయడంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, తిరుమలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

కెరమెరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాలి కులస్తులు ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని మాలి సంఘం నాయకులు శంకర్ అన్నారు. గోయగాం గ్రామంలో శనివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు లక్ష్మణ్, బాపూజీ, దిలీప్, సోనాజీ, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్వోకు అభినందన

కెరమెరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్ పోటీల్లో పతకం సాధించిన సయ్యద్ మజారుద్దీన్‌ను శనివారం పలువురు అభినించారు. హైదరాబాద్‌లోని దూల్‌పల్లి ఫారెస్టు అకాడమిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల మారథాన్ పోటీల్లో 25 కిలోమీటర్ల రన్నింగ్ పోటీల్లో కెరమెరి అటవీ రేంజ్ అధికారి సయ్యద్ మజా రుద్దీన్ తృతీయ బహుమతి సాధించారు.

పశువులకు టీకా వేయించాలి

సిర్పూర్(టి), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి సురేష్‌కుమార్ అన్నారు. సిర్పూర్ (టి) మండలం హీరాపూర్, చుచ్చుపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్యాధికారి సురేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కాగజ్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సమక్షంలో సిర్పూర్(టి) మండలం చీలపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత

లింగాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపటార్ గ్రామంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్ రహెమాన్ ఫౌండేషన్ వారి సహకారంతో శనివారం నిత్యావసర సరుకులతో పాటు బట్టలు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా లింగాపూర్ ఎస్సై గంగన్న మాట్లాడుతూ ఇల్లు కాలబెట్టిన నిందితుడిని త్వరలోనే రిమాండ్‌కు పంపించనున్నా మని తెలిపారు. బాధిత కుటుంబానికి చేయూతనిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రహెమాన్ ఫౌండేషన్ సభ్యులు జాటోత్ దవిత్ కుమార్, బబ్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఐకే ఓసీపీలో బ్లాస్టింగ్‌లు



పత్తి చేనులో వచ్చి పడిన ఓబీ పెల్లలు

జైపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓసీపీలో సింగరేణి అధికారులు ప్రమాదకరంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నా రు. ఇందారం జిన్నింగు మిల్లు సమీపంలో వైద్య శేఖర్ అనే రైతు 20 ఎకరాల చేనును కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నాడు. శనివారం పత్తి చేనులో కూలీలతో పనులు చేస్తుండగా మధ్యాహ్న సమయంలో ఓసీపీలో భారీ పేలుళ్ల జరిగి ఓబీ పెల్లలు పత్తి చేనులో వచ్చి పడ్డాయి. దీంతో రైతు ఓబీ పెల్లల నుంచి తప్పించుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఓబీ పెల్లలు పత్తి చేనులో పడడంతో కూలీలు ఆందోళనకు గురయ్యాడు. ఇందారం ఓసీపీలో సింగరేణి అధికారులు ఓసీపీ కాంట్రాక్టు నిర్వహకులు బొగ్గు ఉత్పత్తి కోసం నియమ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారీతిన పేలుళ్లకఉ పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. బ్లాస్టింగ్‌స మయంలో నియమ నిబంధనలు పాటిస్తూ బ్లాస్టింగ్ చేసే సమయంలో సమీప రైతులకు సూచించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తులు

- జిల్లాలో 32 దుకాణాలకు 566 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో 2025-2027 నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. జిల్లాలోని 32 మద్యం దుకాణాలు ఉండగా ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో 16, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఉన్నాయి. నూతన మద్యం పాలసీలో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 26 నుంచి మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించగా గురువారం వరకు దరఖాస్తుల దాఖలు మందకొడిగా సాగాయి. చివరి రెండు రోజులు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. గత రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు వ్యాపారులు పోటి పడ్డారు. చివరి రోజు దరఖాస్తుల స్వీకరణ రాత్రి వరకు కొనసాగగా మరికొంత మంది క్యూలైన్‌లోనే ఉన్నారు. జిల్లాలోని 32 దుకాణాలకు 566 దరఖాస్తులు వచ్చాయని ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందులో ఆసిఫాబాద్ డివిజన్‌లోని 16 దుకాణాలకు 307, కాగజ్‌నగర్‌లోని 16 దుకాణాలకు 259 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి రూ. 3 లక్షల చొప్పున రూ. 16.98 కోట్లు ఆదాయం సమకూరింది. గతంలో జిల్లాలోని 32 దుకాణాలకు 1020 దరఖాస్తులు రాగ రూ. 20.40 కోట్లు ఆదాయం సమకూరింది. గతంతో పోలీస్తే ఈసారి దరఖాస్తులు తక్కువ రాగ ప్రభుత్వ ఆదాయనికి గండి పడింది. మద్యం టెండర్ల దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలకు పెంచడంతో ఔత్సహికులు ముందుకు రాలేదని తెలుస్తోంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 23న సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి రానుంది.

ఇరుకు రోడ్డుతో తీవ్ర అవస్థలు..

● చెరువు కట్టే ప్రధాన రహదారి ● విస్తరణ చేయకుండానే బీటీ రోడ్డు నిర్మాణం



చెరువు కట్టపై ఇరుకుగా ఉన్న రోడ్డు

భీమారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి వెళ్లేందుకు చెరువు కట్టపై నిర్మించిన బీటీ ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. పదేళ్ల క్రితం మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారి నుంచి పోలంపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించారు. చెరువు కట్టపై రోడ్డు వెడల్పు చేయకుండా బీటీ రోడ్డు నిర్మించడంతో రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్రవాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దాదాపు అరకిలోమీటరు దూరం వరకు నిర్మించిన ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. చెరుటు కట్టపై రోడ్డు చిన్నగా ఉండడంతో ఒక కారు వెళితే మరో కారు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే కట్టపై నిర్మించిన బీటీ రోడ్డు చాలా చోట్ల ధ్వంసమైంది. బీటలు వారిన ప్రాంతాల్లో వాహనదారులు గమనించక కింద పడి గాయాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. రోడ్డు వెడల్పు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. పోలంపల్లికి రోడ్డు నిర్మించే సమయంలో చెరువు కట్ట అడ్డంకిగా ఉంది. దీంతో చెరువు కట్ట మరింత వెడల్పు చేసి రోడ్డు నిర్మించాలని కోరినా అధికా రులు వినిపించుకోలేదు. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొంది కార్మిక శాఖ మంత్రి ఉన్న వివేక్‌వెం కటస్వామి ఇప్పటికైనా చొరవ చూపి రోడ్డును వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు

సమస్యల పరిష్కరిస్తాం

చెరువు కట్టపై రోడ్డుకు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- మధుసూదన్, ఎంపీడీవో

పోలంపల్లికి వెళ్లేందుకు..

భీమారం గ్రామానికి ముందే ఏర్పడ్డ పోలంపల్లికి రోడ్డు కోసం బాట ఏర్పాటు చేయడంతో పూర్వీకులు నిర్లక్ష్యం చూపారు. 20 ఏళ్ల వరకు గ్రామానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఒక వ్యక్తికి చెందిన మామిడితోట మీదుగా చెరువు కట్టకు చేరుకునే వారు. అయితే పంట పొలాల రైతులు, గ్రామస్థులు కలిసి ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కంకర వేసి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసింది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

కోటపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు కళాశాలకు చెందిన సాయిచందన, సౌమ్య, అండర్ 19 బాలుర విభాగం జట్టుకు జశ్వంత్‌లు ఎంపికయ్యారని తెలిపారు. ఇటీవల నస్పూర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను శనివారం ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పొరపాట్లు సరిదిద్దుకోవాలి

జైపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎంపీడీవో సత్యనారాయణ అధ్యక్షతన శనివారం 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అమలులో సిబ్బంది చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లను గుర్తించామని, వీటిని సరిదిద్దుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా తగు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం పారదర్శకంగా ప్రజలకు మేలు కలిగే విధంగా అమలు కావాలన్నారు. పథకానికి సంబంధించి గ్రామస్థాయి అధికారులు, సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు వేతన కూలీలు అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీపనుల కింద ఖర్చు చేసిన మొత్తాలను వివరించారు. మొత్తం 393 పనులు చేపట్టగా వేతనాల కింద రూ. 4,91,73,592, మెటీరియల్ కింద రూ. 1,08,93,304, మొత్తం రూ. 6,00,66,896 ఖర్చు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, జిల్లా విజిలెన్స్ అధికారి కిరణ్, శివరాం, తహసీల్దార్ వనజారెడ్డి, ఏపీవో బాలయ్య, సోషల్ ఆడిట్ ఎస్టీఎం వేణు, రవి, డీఆర్‌పీలు, ఏపీవోలు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ ఆత్మహత్యాయత్నం

లక్షెట్టిపేట, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఎస్సీ బాలుర పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ బాలసంకుల రాజగోపాల్‌రావు శనివారం ఆత్మహత్యాయత్నం చేసారు. ఉన్నతాధికారుల వేదింపులు తట్టుకోలేక సాయంత్రం సుమారు 4గంటలకు యాసిడ్ తాగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఆయనను నిర్మల్‌లోని ఓఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గతంలో ఆయన దండేపల్లి, దొనబండ వసతిగృహాల్లో కూడా ఇన్‌చార్జిగా పని చేసారు. ఉన్నతాధికారులు ఎందుకు వేధించారు.? వేధించిన అధికారులు ఎవరు అనేది ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

టీజేఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా రాజయ్య

శ్రీరాంపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జన సమితి (టీజేఎస్) మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా సమ్ము రాజయ్యను నియమిస్తూ సమితి జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాజయ్యకు శనివారం నియామకపత్రం అందించారు. సింగరేణి కార్మికుడిగా సేవలందించిన సమ్ము రాజయ్యకు యూనియన్ కార్యకలాపాల్లో విశేష అనుభవం ఉంది. ఎన్నో కార్మిక సమస్యలపై ఆయన తన గళమెత్తారు. తెలంగాణ జన సమితి జిల్లా కమిటీ సభ్యులు రాజన్న, ప్రసాద్ యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రమిదల వేడుక



● నవ్వుల రవ్వలు విరజిమ్మే పండుగ.. ● లక్ష్మీ పూజలు, కేదారేశ్వర వ్రతాలు ● రేపు దీపావళి

నస్పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగుతుండేవే పండుగలు.. వాటిలో ఆనందోత్సవాలతో సమైక్యంగా జరుపుకునే పండగ దీపావళి.. ఇళ్ల ముందర దీపపు కాంతుల వెలుగులు, ఆకాశంలో తారాజువ్వల కాంతులు ఇంటింటా ఆనందాల కోలాహలం, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకునే వేడుక. సిరులను కురిపించే పండుగ నిర్వహణకు జిల్లా వాసులు సిద్ధమైయ్యారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించే పండుగ.. లక్ష్మీ కటాక్షం కోసం శ్రీ కేదారేశ్వర వ్రత మారించడం, పిల్లాపాపలతో కలిసి పెద్దలు కూడా టపాసులను పేల్చుతూ ఆనందంగా కేరింతలు కొడుతూ సంబరాలకు సిద్ధం అవుతున్నారు.

సిరిసంపదలు ప్రసాదించే దేవత...

దీప జ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనో వికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళామణులందరూ ఆశ్వయుజ బహుళ చతుర్థశి నుంచి కార్తీక మాసమంతా సధ్యా సమయంలో మట్టి ప్రమిదలో దీపాలను వెలిగిస్తారు. దీపాలను ముత్త యిదువులు పుణ్యనది స్నానాలను ఆచరించి జీవ నదుల్లో దీపాలను వదిలి పెడుతారు. దీపావళి రోజు మహా లక్ష్మి పూజ జరుపుకోవడానికి విశిష్టత కలిగి ఉన్నది. మహర్షులకు మోక్షలక్ష్మి రూపంగా, విజయాన్ని కోరే వారికి విజయలక్ష్మిగా, విద్యార్థులు ఆరాధిస్తే విద్యాలక్ష్మిగా, ఆష్వరాన్ని కోరే వారికి దనలక్ష్మిగా, అన్ని వరాలు నెరవేర్చే వరలక్ష్మిగా దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించే వారికి సర్వ సంపదలు చేకూరుతాయని నమ్మకం..

లక్ష్మీదేవి పూజలు..



దీపావళి రోజున వ్యాపారులు కొత్త ఖాతాలను తెరవడం, ఇళ్లలో, వ్యాపార కేంద్రాల్లో, కార్యాలయాల్లో లక్ష్మీదేవి పూజలను నిర్వహించారు. వ్రతాలను చేసేవారు కేదారేశ్వర నోము, శ్రీ సత్య నారాయణ స్వామి వ్రతాలను ఆచరిస్తారు. ఆయా ప్రాంతాలల్లో దీపావళి లక్ష్మీదేవి పూజలు అక్కడి పద్ధతులను ఆధారంగా నిర్వహిస్తారు. ఆనందోత్సవాల నడుమ లక్ష్మీదేవి పూజలను నిర్వహించి స్వీట్లను పంపిణీ చేస్తారు.

విద్యుత్ దీపాలతో అలంకరణ...

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కాంతుల వెలుగులతో గృహాలు శోభయమానంగా కనిపిస్తాయి. రంగురంగుల విద్యుత్ లైట్ల వెలుగులు ప్రకాశవంతంగా కనిపిస్తాయి. ఒక వైపున ప్రమిదల వెలుగులు, మరో వైపున విద్యుత్ దీపాల కాంతుల అలంకరణలు ఆ వీధులకు కొత్త శోభను తెచ్చి పెడుతోంది. ఇళ్ల, వ్యాపార సముదాయాల వద్ద పాల చెట్టు కొమ్మలు, అరటి చెట్లు, కొబ్బరి ఆకులతో అలంకరణ చేసి, సహజ సిద్ధంగా లభించే పూలతో పాటుగా ప్లాస్టిక్‌తో తయారు చేసిన పూల దండలతో అందంగా అలంకరణ చేస్తారు.

దీపావళి శోభ...

పూజా సామగ్రి కొనుగోళ్ల సందడితో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌లోని వ్యాపార కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. నరకాసురుడు రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతని పీడ వదిలిన ఆనందంతో దీపావళిని జరుపుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలో రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన వేళ ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం పేర్కొంటుంది. చీకటిని పారదోలుతూ వెలుగును తెచ్చే పండగగ విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటారు.



యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

కాసిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని పెద్దనపల్లి మాజీ సర్పంచు వేముల కృష్ణ పేర్కొన్నారు. శనివారం పెద్దనపల్లి నాయకపుగూడలోని యువతకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చెండె నవీన్, నాయకులు రవి, మహేష్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

పైలేరియా పై సర్వే

మందమర్రిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొన్నారం గ్రామంలో శనివారం బోధకాలు వ్యాధిపై వైద్యులు రమేష్, శరత్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ బోధకాలు వ్యాధికి సకాలంలో వైద్యం తీసుకుంటే నయం చేయవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయ, ఏఎన్ఎం గ్లోరీ, ఈద లింగయ్య, ఆశా కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

జన్నారం: మురిమడుగు గ్రామంలో బోధకాల సర్వే శనివారం మండల ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గంగాదేవి మాట్లాడుతూ 2030 నాటికల్ల పైలేరియా నియంత్రణ పూర్తి స్థాయిలో ఉంటుందని ఈసర్వేలో అందరూ పాల్గొనాలన్నారు. పైలేరియా గుర్తించిన మొదట్లోనే వైద్యం చేయించుకుంటే అదుపులో ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే మరింత తీవ్రం అవుతుందని అది సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కమలాకర్, పోచయ్య, సత్యం, లక్ష్మీ, సులోచన, రాజేశ్వరి, భూమక్క, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు మంజూరైనా ఇంకా ఇళ్ల పనులను ప్రారంభించని లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టేలా చూడాలన్నారు. బేస్‌మెంట్, లెంటల్, స్లాబ్‌ల వారీగా జరిగిన పనులను ఫోటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే మున్సిపాలిటీల పరిధిలో వంద శాతం ఆస్తి పన్నులను వసూలు చేయాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

హెచ్ఐవీ నియంత్రణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, హెచ్ఐవీ నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించాలని, వ్యాధి గ్రస్తుల పట్ల ఉన్న వివక్షను రూపుమాపేందుకు అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో డీ ఎంహెచ్‌వో అనిత, ప్రోగ్రాం అధి కారి సుధాకర్ నాయక్, డీఎంవో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో నాందేవ్, ఐసీ టీసీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చివరి రోజు భారీ స్పందన..

(7వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు శనివారంతో గడువు ముగియనుంది. సాయంత్రం ఐదు గంటల వరకే దరఖాస్తు గడువు పూర్తికాగా, అప్పటి వరకు క్యూలో ఉన్నవారిని అధికారులు అనుమతించారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఈ నెల 17 వరకు కేవలం 655 దరఖాస్తులు రాగా, చివరి రోజు పెద్ద మొత్తంలో వ్యాపారుల నుంచి స్పందన కనిపించింది. సాయంత్రం 6 గంటల వరకు ఏకంగా మరో 889 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా శనివారం వరకు 1544 దరఖాస్తులు వచ్చాయి. కాగా గడువు ముగిసే సమయానికి మంచిర్యాల ఎక్సైజ్ శాఖ పరిధిలో 717 దరఖాస్తులు, బెల్లంపల్లిలో 382, చెన్నూర్‌లో 211, లక్షెట్టిపేటలో 234 దరఖాస్తులు వచ్చాయి. కాగా గత మద్యం పాలసీతో పోలిస్తే దాదాపు 700పై చిలుకు దరఖాస్తులు తగ్గగా టెండర్ల రూపంలో సుమారు రూ. 21 కోట్ల ఆదాయాన్ని అబ్కారీ శాఖ కోల్పోయింది. గత మద్యం పాలసీలో గడువు ముగిసే సమయానికి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మొత్తం 2242 దరఖాస్తులు రాగా, ఈ సారి పెద్ద మొత్తంలో తగ్గాయి. దరఖాస్తు ప్రక్రియ ముగియగానే, సంబంధిత వ్యాపారుల సమక్షంలో ఈ నెల 23వ తేదీన లక్కీ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు.



బెల్లంపల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ నాయకుల రాస్తారోకో



తాండూర్‌లో సీపీఎం నాయకుల రాస్తారోకో



కాసిపేట మండలం కొండాపూర్ యాప వద్ద నాయకుల రాస్తారోకో



జైపూర్‌లో..



లక్షెట్టిపేటలో రాస్తారోకో చేస్తున్న అన్ని పార్టీల నాయకులు

బంద్ సంపూర్ణం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సంఘాలు శనివారం తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా శనివారం బంద్ విజయవంతమైంది. బంద్‌లో భాగంగా విద్య, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి.

ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బందుకు అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు అయిన బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు స్వచ్ఛందంగా మద్ద తు తెలుపుతూ బందులో పాల్గొన్నారు. బంద్ సందర్భంగా జిల్లా కేంద్రం తో పాటు, చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి పట్టణాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ నినాదాలు చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మందమర్రిలో చేపట్టిన బంద్ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ పాల్గొన్నారు. బీసీ నాయకులతో కలిసి ర్యాలీ చేపట్టారు.



మంచిర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



భీమారంలో ర్యాలీ...



జన్నారంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు



చెన్నైలలో దుకాణాలు మూయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పత్తి అమ్మకాలను సులభతరం చేయడానికే యాప్

కాసిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటను దళారులకు అమ్మకుండా నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేసే సీసీఐలో అమ్మే విధంగా కపాస్ కిసాన్ యాప్ అందుబాటులోకి వచ్చిందని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ అన్నారు. శనివారం గురువాపూర్, పెద్దాపూర్, దేవాపూర్ గ్రామాల్లోని పత్తి రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా నేరుగా స్లాట్ బుక్ చేసుకుంటే బయోమెట్రిక్, కనుపాప, ఓటీపీ ద్వారా పత్తి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల బారి నుంచి బాధలు తప్పుతాయన్నారు. పత్తి రైతులు 8 నుంచి 12 శాతం లోపు తమ ఉండేలా చూసుకోవాలన్నారు. యాప్ ద్వారా పత్తి అమ్మిన రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. ఏఈవోలు శ్రీధర్, సంధ్యారాణి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : రైతులు కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని చెన్నూరు ఏడీఏ బానోద్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సారంగపల్లి గ్రామంలో యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా అమ్మడానికి ముందుగానే స్లాట్ బుక్ చేసుకుంటే ఆ తేదీనే పత్తిని అమ్మవచ్చన్నారు. ప్రతి రైతు ఈ యాప్‌పై అవగాహన పెంచుకుని పత్తిని విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, ఏఈ వోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బాల్క సుమన్ పుట్టిన రోజు వేడుకలు

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో, మండలంలో శనివారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సుమన్ పేరు మీద హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి : కోటపల్లిలో శనివారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్కసుమన్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేష్, పీఏసీఎస్ ఛైర్మన్ సాంబగౌడ్‌లు కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టె నారాయణ, సంపత్ రెడ్డి, గోనె మోహన్‌రెడ్డి, మోతె తిరుపతి, మంత్రి బాపు, బాపునాయక్, అన్వర్, మారుపాక పోచం, అజ్మీర పున్నం, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

భీమారం : భీమారంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. చెన్నూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ బాల్క సుమన్‌ను హైదబాద్‌లోని తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ నాయక్, రాజునాయక్, దేవునాయక్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

మధుకర్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వేమనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ దశ దిన కర్మను శనివారం నిర్వహించగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. మధుకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఒక నాయకుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణు మాధవ్‌రావు, నాయకులు పురాణం లక్ష్మీకాంత్, పీఏసీఎస్ ఛైర్మన్ కుబిడె వెంకటేష్, మాజీ జడ్పీటీసీ భీమన్న మాజీ సర్పంచులు లక్ష్మీనారాయణ, రమేష్‌గౌడ్, బాపు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

దండేపల్లి అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మ్యాదరిపేట గ్రామ పంచాయతీ పరిదిలోని మదాపూర్‌లో శ్రీకృష్ణ గోశాలోని వైభవోపేతంగా శనివారం 116 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. అంజనేయస్వామికి భక్తులు పలు రకాల ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. అనంతరం శ్రీకృష్ణా గోశాల ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం వితరణ చేపట్టారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌సీఆర్పీలతో శనివారం సమావేశం నిర్వహఙంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యావికాసానికి ప్రాథమిక పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని చెప్పారు. సమావేశంలో ఏసీఎంవో ఉద్దవ్, ఎస్‌సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసి.. శుభాకాంక్షలు తెలిపి..


డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డిని శనివారం డీజీపీ కార్యాలయంలో ఆసిఫాబాద్ బీజేపీ సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో బెల్లంపల్లి ఏఎస్పీగా పని చేసిన సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఉన్న విషయాన్ని గుర్తు చేసుకన్నారు. వారి వెంట వ్యాపారి ఉమేష్ యాదవ్ ఉన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభం


లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభిస్తున్న జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఆర్డీవో కార్యాలయంలో శనివారం జిల్లా జడ్జి యువరాజ, ఆర్డీవో లోకేశ్వర్‌రావు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ అవర్నేస్ అండ్ వెల్‌నెస్ వావిగేషన్ ఫర్ ఎ డ్రగ్ ఫ్రీ ఇండియా స్కీం-2025లో భాగంగా మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడిన వారికి ఈ సెంటర్‌లో సలహాలు సూచనలు ఇవ్వనున్నారని అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ప్రారంభించిన సెంటర్‌లో సీనియర్ సిటిజన్‌కు సలహాలు, సూచనలు అందుతాయని చెప్పారు. బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి డాక్టర్ కె.సాయిలక్ష్మి, న్యాయవాది విజయ్‌కుమార్, పీఎల్‌వీ రాజేశ్వరి, న్యాయవాది కిశోర్, లింగయ్య ఉంటారని చెప్పారు. అవసరమైన వారు తప్పక వినియోగించుకోవాలని సూచించారు కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22న హ్యాండ్‌బాల్, ఖోఖో పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సామాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో అండర్-14, 17 బాలబాలికల హ్యాండ్‌బాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నామని డీఈవో దీపక్ తివారీ, క్రీడల నిర్వహణ కార్యదర్శి వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు జంగు, పీడీ మీనారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడవి పందుల బెడద.. అన్నదాతలకు వ్యథ

- పంటలపై మూకుమ్మడి దాడి
- రాత్రి వేళల్లో చేలల్లోకి చొరబడి బీభత్సం
- నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం పరిహారం అందించాలని వినతి


బెజ్జూరులో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి, పత్తి పంట

బెజ్జూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అడవి పందులు నట్టేటా ముంచుతున్నాయి. పత్తి, వరి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తుండడంతో రైతు బతుకు గాలిలో దీపంలా మారింది. గత కొన్నేళ్లుగా అడవి పందుల దాడిలో పంటలు నష్టపోయి నష్టపరిహారం అందక అవస్థలు పడుతున్నారు. అతి వృష్టి, అనావృష్టి కారణంగా సత మతమైన అన్నదాతలు ప్రస్తుతం చేతికి వచ్చిన పంటలను కాపాడుకునేందుకు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికంది అమ్ముకునే దాకా రైతులకు ఇబ్బందులే. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు, చీడపీడలతో పంటల దిగు బడులపై ప్రభావం చూపుతుండగా, పంటలు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు కురవడంతో ఆపసోపాలు పడుతున్న అన్నదాతకు అడవి పందుల రూపంలో మరో ఎదురుదెబ్బ ఎదురవుతోంది. రైతులు సాగు చేసిన పత్తి, కంది, వరి పంటలకు అవి చేస్తున్న నష్టం అంతా ఇంతా కాదు. సాగు చేసిన పంటలను రక్షించు కునేందుకు రైతులు ఎన్నో పాట్లు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి కోటి ఆశలతో సాగుకు శ్రీకారం చుట్టిన రైతన్నలకు అడవి పందుల రూపంలో బెడద తప్పడం లేదు. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గం లోని బెజ్జూరు, చింతలమానేపల్లి, పెంచికలపేట, సిర్పూర్ (టి) మండలాల్లోనే పందుల బెడద ఎక్కువగా ఉంది. రైతులు సాగు చేసిన పత్తి పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం పత్తి కాత, పూత కాలం కావడంతో పంట చేలల్లో అడవి పందులు గుంపులుగా వెళ్లి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల ఎకరాల్లో పత్తి, 56వేల ఎకరాల్లో వరి, మరో ఇరవై ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి.

● పంటలకు రక్షణ ఎలా..

పంటల సాగుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయం చేస్తున్నా ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంటల దిగుబడి రాక అప్పుల్లో మునుగుతుండగా మరోవైపు అడవి పందుల బెడదతో ఉన్న పంట కాస్తా చేతికి రాకుండా పోతుండడంతో అప్పులే మిగులు తున్నాయని వాపోతున్నారు. పత్తి కాయలు, పూతను పందులు పూర్తిగా తిని ధ్వంసం చేస్తుండటంతో కాత సమయంలోనే పంటలకు నష్టం సంభవిస్తుండటంతో సాగు కోసం పెట్టిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పంటలను రక్షించుకునేందుకు చేల చుట్టూ చీరలతో రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నారు. కానీ వాటి నుంచి పంటలను రక్షించుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్య ఎక్కువగా అటవీ సమీప ప్రాంత చేలల్లో అడవి పందుల బెడదతో పంటలకు నష్టం జరుగుతోంది.

● అటవీ ప్రాంత గ్రామాల్లో..

జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల పంట చేలల్లో అడవి పందుల కారణంగా ఏటా పంటలకు నష్టం జరుగుతున్నా అటవీ శాఖ ఎలాంటి సాయం అందించడం లేదు. గత దశాబ్ద కాలంగా ఈ సమస్య అధికంగా ఉంది. అయితే అడవి పందుల బెడద కారణంగా పంటలకు నష్టం జరుగుతున్నా నష్టపరిహారం మాత్రం ఏమాత్రం అందడం లేదు. అడవి పందుల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా పంట చేలల్లోనే కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు.ఒక్కోసారి పందులు గుంపులుగా వచ్చిన సమయంలో దాడి చేస్తాయనే భయంతో ఏం చేయలేకపోతున్నామని తెలుపుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులను చంపేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ షరతులు ఉండడంతో వాటిని అటవీశాఖ కూడా ఏం చేయలేకపోతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి, వరి పంటలను పూర్తిగా ధ్వంసం కావడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పంటలకు నష్టం సంభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఏటా వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతున్నా ప్రభుత్వం 10శాతం రైతులకు కూడా సరిగా పరిహారం అందించడం లేదని రైతులు వాపోతున్నారు. పంట నష్టం జరిగిన మూడు రోజుల్లో పు స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. సర్వే చేసిన తర్వాత ఎంతమేరకు నష్టం వాటిల్లిం దో పంచనామా నిర్వహించి వివరాలు నమోదు చేసుకుంటారు. నష్టాన్ని బట్టి పరిహారం అందజేస్తారు. కొన్నేళ్లుగా దరఖాస్తులకే పరిమితమైనా పంట నష్ట పరిహారం అందడం లేదు. అధికారులు పంటలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిహారం చెల్లించాలి..

- గుర్లె భీంరావు, రైతు, చిన్నసిద్దాపూర్

అడవి పందుల దాడిలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేస్తున్న పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. అయినా తమ గోడును ఎవ్వరూ కూడా పట్టించుకోవడం లేదు.

పంటలకు రక్షణ కరువైంది..

- చటారి ఐక్కయ్య, రైతు, ఎల్కపల్లి

ఎంతో కష్టపడి సాగు చేస్తున్న పంటలకు రక్షణ కరువైంది. పంటలను కాపాడుకు నేందుకు ప్రతినిత్యం ఇంట్లో వారంతా చేలల్లోనే కాపలా ఉండాల్సిన పరిస్థి తులు ఉన్నాయి. అయినా పంటలకు నష్టం జరుగు తూనే ఉంది. ఇక అడవి పందుల బెడద కారణంగా వ్యవసాయం చేయడం కష్టతరంగా మారింది.


కనర్‌గాం వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన

వాగుపై తాత్కాలిక వంతెన

వాంకిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం కనర్‌గాం సమీపంలోని వాగుపై గ్రామస్థులు తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేశారు. వాంకిడి నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే రోడ్డుకు అడ్డంగా ప్రవహించే వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలం రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు కాగజ్‌నగర్ నుంచి వాంకిడికి రాకపోకలు చేయడానికి తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పించారు.

ముక్కిన రేషన్ బియ్యంపై ఫిర్యాదు

పెంచికలపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి గత నాలుగు రోజుల క్రితం బెజూజరు సివిల్ సప్లయి గోదాం నుంచి రేషన్ డీలర్ ఉచిత బియ్యాన్ని అందించారు. శుక్రవారం నుంచి బియ్యం ప్రజలకు పంపిణీ చేస్తుండగా బియ్యంను గమనించిన లబ్ధిదారులు అందులో ముక్కిన నూకల బియ్యం ఉన్నాయని, అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం సివిల్ సప్లయి డీటీజీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బియయం పరిశీలించి వాటి నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీ బియ్యం నాసిరకంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులకు నాణ్యమైన బ్యిం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట ఆర్ఐ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సుధాకర్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

బీసీ జేఏసీ బంద్ ప్రశాంతం

● స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేత ● డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు ● జిల్లా కేంద్రంలో బీసీ నాయకుల రాస్తారోకో


ఆసిఫాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్ట భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపులో బాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా జరిగింది. బీసీ జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో రెండు రోజుల నుంచి ప్రతి సంఘాల నాయకులను కలిసి బంద్‌కు సహకరించాలని కొరగా స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య సముదాయలను మూసి వేసి వ్యాపారులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. బంద్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. బస్టాండు ఎదుట బీసీ సంఘం నాయకులు బస్సులు బయటికి వెళ్లనీయకుండా రాస్తారోకో నిర్వహించారు. దీంతో మధ్యాహ్నం వరకు డిపో నుంచి ఒక్క బస్సు కూడ బయటకు వెళ్లలేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లె ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై చట్ట భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నాయకులు అంబేద్కర్‌చౌక్ ఎదుట ధర్నా రాస్తారోకో చేపట్టారు. అలాగే సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బంద్‌కు మద్దతు తెలిపి పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల, అయా పార్టీల నాయకులు శ్యాంనాయక్, బాలేశ్వర్‌గౌడ్, గాదవేణి మల్లేష్, మంగ, ప్రణయ్, విశాల్, శంకర్, జీవన్, ఆలీబిన్ అహ్మద్, బద్రీ సాయి, చిరంజీవి, దినకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో విజయవంతం అయింది. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేశ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు బీఆర్ఎస్, బీజేపీ, ఎమ్మార్పీ ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు, సీనియర్ సిటిజన్, వ్యాపారులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాస్, నాయకుల దస్తగిరి, శ్యాంరావు, సత్యనారాయణ, వెంకటేష్, రమేష్, తిరుపతి, నాగేశ్వర్‌రావు, రమణయ్య, షబ్బీర్ హుస్సేన్, మల్లయ్య, మెహరాజ్, మల్లేష్, శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, విజయ్‌సింగ్, ఇస్తారు, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో విజయవంతం అయింది. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. దీంతో మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలను బీసీ సంఘాల ఆధ్వర్యంలో మూసి వేయించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ కుమారస్వామి, చర్యలు చేపట్టారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో విజయవంతం అయింది. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. దీంతో మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.


కాగజ్‌నగర్ పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలం లోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు మూసివేశారు. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుండా చూశారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. బంద్‌కు కాంగ్రెస్ నాయకుల మద్దతు తెలిపి రెబ్బెన నుంచి గోలేటి టౌన్ షిప్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, వ్యాపార సముదాయాలు మూసి వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, దేవాజీ, సోమశేఖర్, గంటుమేర, కార్తీక్, మురళీ, మధునయ్య, కిషన్‌గౌడ్, రవీందర్, సాయి, సంజీవ్, సాయి, సుబ్బారావు, తిరుపతి, జాహిర్ బాబా, నాగేష్, కె.నాగేష్, శంకరన్న, మహేష్, సంతోష్, బాబు, రవీందర్, కూశన్న, రాజన్న, మల్లేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే మండలంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీఆర్ఎస్ నాయకులు నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, తుకారాం, సుధాకర్, దీపక్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో బంద్ విజయవంతమైంది. ఉదయం నుండే మండలంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు బంద పాటించాయి. బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, మాలి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. పోలీసు స్టేషన్ నుంచి నార్‌పల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, వెంకటి నాయక్, శ్రీనివాస్, సుభాష్, తిరుపతి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో బంద్ విజయవంతం అయింది. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. పోలీసులు అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా చూశారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండ లంలో బంద్ విజయవంతంమైంది. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు బంద్ పాటించాయి. బీసీ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దుకాణాలను మూసి వేయించారు. దీంతో మండలంలో బంద్ ప్రశాంతంగా ముసిగింది.


కాగజ్‌నగర్‌లో నిరసన తెలియజేస్తున్న నాయకులు


బెజ్జూరులో మూసి ఉన్న దుకాణాలు


వాంకిడిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఆసిఫాబాద్‌లో డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

వాహనాలు సీజ్

పెంచికలపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేని ట్రాక్టర్, ఒక బొలేరో వాహనాన్ని ఆర్టీఏ అధికారులు రాజశేఖర్, సంజయ్‌లు సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. శనివారం తనిఖీలు చేపట్టగా కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామ సమీపంలో సరైన పత్రాలు లేని ఒక ట్రాక్టర్, ఒక బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సిర్పూర్(టి), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి)కి చెందిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అభిమాని డోంగ్రి అరుణ్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోనప్ప శనివారం పరామర్శించారు. ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

రైతులకు అవగాహన

లింగాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచన్‌పల్లి గ్రామ పంచాయతీలోని రైతువేదికలో రైతులకు పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఏవో సంజయ్, ఏఈవో ఖలీల్ శనివారం అవగాహన కల్పించారు. మండలంలోని రైతులందరూ తమ పట్టా పాస్ బుక్కులకు సెల్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని అన్నారు. పత్తి కొనుగోల్లు ప్రారంభం కాకముందే రైతులు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కిసాన్ కపాస్ యాప్‌లో రైతులు తమ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు.

బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

లింగాపూర్/జైనూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసురక్ష బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని నాబార్డు అధికారి లోక భూమారెడ్డి. జైనూర్ కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఈశ్వర్ అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రజలకు అవగా హన కార్యక్రమం నిర్వహించారు. బీమా సౌకార్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కుడమేత విశ్వనాథ్, హన్నుపటేల్ తదితరులు పాల్గొన్నారు.